# ఆంధ్ర సాహిత్యము - అనేకార్థక కావ్యములు

Dr. Peri Suryanarayana,

Reader in telugu,

Mrs. A.V.N.College,

Visakhapatnam.

కవి ఒక కథను గ్రహించి, ఒక కావ్యమును సృజించుట సామాన్య విషయమనిపించును. కాని, రెండు, అంతకంటె ఎక్కువ కథలను, సంధించి వానిని ఒకే కావ్యముగ రచించుట అసామాన్య విషయముగ తోచును. ఆంధ్ర సాహిత్యమున, రెండు, మూడు, నాలుగు కథలను, సహితము అనుసంధించి ఒకే కావ్యముగ రచించిన కవులు గలరు. రెండర్థములు - కథా సంబంధమైనవి - కలిగిన కావ్యమును 'ద్వ్యర్థి' కావ్యమని మూడు, నాలుగు కథార్థములు కలిగిన కావ్యములను త్ర్యర్థి, చతురర్థి కావ్యములని, వ్యవహరించుట కలదు. ఒకటి కంటె ఎక్కువ కథార్థములను బోధించు, ఈ కావ్యములను' అనేకార్థక' కావ్యములని వ్యవహరించుట సముచితముగ నుండును.

అనేకార్థక కావ్యములందు శ్లేష వలన భిన్న ఇతివృత్తములు అనుసంధింపబడుచుండును. ఇవి స్వరూపము నందు భిన్నమైన ఇతివృత్త సంయోజకములై, స్వభావమున శ్లేష ప్రధానములై యొప్పును. ఉదాహరణమునకు, పింగళి సూరన రాఘవ పాండవీయము రామరాజభూషణుని 'హరిశ్చంద్రనలోపాఖ్యానము'.

ఆంధ్రమున వెలసిన అనేక సాహితీ ప్రక్రియలకు సంస్కృత సాహిత్యము మార్గదర్శకమైనది. సంస్కృతమున అనేకార్థక కావ్య రచనమునకు శ్రీకారము చుట్టినవాడు దండియని భోజకవి –
క్రీ.శ. 11వ శతాబ్ది - ఉభయాలంకార చర్చ సందర్భమున ఈ విధముగ పేర్కొనినాడు.

**''తృతీయస్య యథాదండినో ధనంజయస్య వా ద్వి సంధాన**
**ప్రబుధౌ రామాయణ మహాభారతార్థావనుబధ్నాతి''**

ఆంధ్రమున వెలసిన, ఈ అనేకార్థక కావ్య ప్రక్రియ సంస్కృత సాహిత్య ప్రభావము తోడనే కూడి యున్నదనుట పునరుక్తియైనను, దానిని నిరూపింపవచ్చును. సంస్కృతమున 'కవిరాజు' రచించిన రాఘవ పాండవీయ మందలి శ్లోకములు, పింగళి సూరన రాఘవ పాండవీయ పద్యములకు మాతృకలు.

**"పదమేకమపి శ్లిష్టం వక్తుం భూయాస్ పరిశ్రమః**
**కథాద్వయైక నిర్వోఢుం కింధరాధిపతితోఽధికః''**
**''రెండర్థంబులపద్య మొక్కటియు నిర్మింపంగ శక్యంబుగా**
**కుండుం దద్గతిఁ గావ్యమెల్లనగునే నోహోయనంజేయదే**
**పాండిత్యంబున నందునుం దెనుదు కబ్బంబద్భుతంబండ్రు ద**
**క్కుండెవ్వాడిల రామభారతకథల్ జోడింప భాషాకృతిస్''**

**వాఙ్మయి**

ఆంధ్ర సాహిత్యమున ప్రప్రథమముగ, అనేకార్థక కావ్యము వేములవాడ భీమకవి రచించినట్లును అది సూరన కాలమునకు భ్రష్టమైనట్లును. ఈ క్రింది పద్యమువలన తెలియును.

'' భీమనతొల్లి సెప్పెనను పెద్దల మాటయోగాని యందు నొం
డేమియు నేయడన్నిలుచుటెవ్వరుఁగాన రటుండనిమ్మునా
నామహిత ప్రబంధరచనా ఘనవిశ్రుతి నీకు గల్గుటస్
నామది దద్వ్యయార్థకృతినైపుణియుం గలదంచునెంచెదస్''

కావున ఉపలబ్ధ కావ్యములలో సూరన రాఘవ పాండవీయమే ప్రథమమైనది.

ఆంధ్ర సాహిత్యమున ఈ అనేకార్థక కావ్యములు ఇరువది యొక్కటి వరకు కనిపించు చున్నవి. – అవి

1. రాఘవ పాండవీయము - పింగళిసూరన
2. హరిశ్చంద్రనలోపాఖ్యానము - రామరాజభూషణుడు
3. రామకృష్ణ విజయము - మరింగంటి సింగరాచార్యులు
4. నలయాదవరాఘువ పాండవీయము - మరింగంటి సింగరాచార్యులు
5. నైషధ పారిజాతీయము - కృష్ణాధ్వరి
6. రాఘువ కృష్ణ పాండవీయము - రాజ చూడామణి దీక్షితులు
7. రాఘువ యాదవ పాండవీయము - ఎలకూచి బాలసరస్వతి.
8. నలయాదవ రాఘువ పాండవీయము - గునుగుటూరి వేంకటకృష్ణ కవి.
9. యాదవ రాఘువ పాండవీయము - నెల్లూరి వీరరాఘువ కవి
10. శివ, రామాభ్యుదయము - వోడూరు పెదరామామాత్యుడు
11. యాదవ భారతీయము - చెన్నకృష్ణ కవి - నందవరీకి
12. అచలాత్మజా పరిణయము - తిరుమల బుక్కపట్టణము - కిరీటి వేంకటాచార్యులు.
13. లంకా విజయము(రావణదమ్మీయము) - పిండిప్రోలు లక్ష్మణకవి.
14.కృష్ణార్జున చరిత్రము - మంత్రిప్రెగడ సూర్యప్రకాశ కవి.
15. రామకృష్ణార్జున(రూప)నారాయణీయము - ఓరుగంటి సోమశేఖర కవి

| | |
|---|---|
| 16. రామకృష్ణోపాఖ్యానము | - శ్రీపాద వేంకటాచలకవి |
| 17. రాఘవ వాసుదేవీయము | - చిత్రకవి సింగరార్యుడు |
| 18. వసుస్వారోచిషోపాఖ్యానము | - కొత్తపల్లి సుందరరామకవి |
| 19. సారంగధరీయము | - పోకూరి కాశీపతి |
| 20. ధరాత్మజా పరిణయము | - క్రొత్తలంక మృత్యుంజయకవి |
| 21. యాదవరాఘవపాండవీయము | - అయ్యగారి వీరభద్రకవి. |

ఇవియే కాక శ్రీనివాసాచార్యుని "సౌంగంధికాపారిజాతము", కామేశ్వరామాత్యుని "రాఘవ యాదవీయము" రావిపాటి లక్ష్మీ నారాయణుని "భారతగర్భ రామాయణము"ను కలవని శ్రీ జి. నాగయ్యగారు 'తెలుగుసాహిత్య - సమీక్ష' రెండవ సంపుటిలో పేర్కొనిరి. కాని వీని ప్రస్తావన మరి యెక్కడను కనుబడుట లేదు.

పైన పేర్కొనిన కావ్యములను, తత్కర్తలను స్థూల పరిచయము ఉత్తమమైనది. నిశిత పరిశీలనమున వ్యాస విస్తృతి కావింపబడుననుటలో అతిశయోక్తి లేదు.

1) ***రాఘవ పాండవీయము: -*** ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త పింగలి సూరన. రచనాకాలము క్రీ.శ. 1550 సం.లని విమర్శకుల ఊహ. నాలుగాశ్వాసములు కలిగి, ఆకువీటి పెద వేంకటాద్రి కోరిక ననుసరించి, శ్రీ విరూపాక్ష స్వామికి అంకితము కావింపబడినది. ముద్దరాజు గణపయామాత్య పెదరామధీమణి , దీనికి 'దర్పన' మను వ్యాఖ్యానము వ్రాసినాడు. గ్రంథములభ్యము సూరన తన గ్రంథమున ద్వ్యర్థి కావ్య పఠన విధానమునిట్లు పేర్కొనినాడు.

**''ఒకకథ వినియెడితఱివే**
**ఱొక కథపై దృష్టియిడిన నొకయర్థము దోఁ**
**పకపోవుఁగాన నేకా**
**ర్థ కావ్యమెట్లట్ల వినగదగునొకటొకటిన్''**

***2. హరిశ్చంద్రనలోపాఖ్యానము :-*** ఇది ద్వ్యర్థి కావ్యము. కవి రామరాజభూషణుడు రచన క్రీ. శ. 1575 సం. అని విమర్శకుల అభిప్రాయము. అయిదు ఆశ్వాసములు కలిగి

శ్రీరామచంద్రుని కంకితమైనది. గ్రంథము లభ్యము. చిత్రకవి అనంతుడు 'ప్రకాశిక' యను వ్యాఖ్యానమును రచించినాడు.

***3,4. రామకృష్ణ విజయము, నలయాదవ రాఘవ పాండవీయము :-*** ద్వ్యర్థి, చతురర్థి కావ్యములైన వీనిని మరింగంటి సింగరాచార్యులు రచించినాడు. 16వ శతాబ్దపు చివరివాడని కవితరంగిణీకారులభిప్రాయము వ్యక్త పరిచిరి. గ్రంథములు లభ్యాలభ్య విషయమై స్పష్టమైన సమాచారము లభించుట లేదు.

***5. నైషధ పారిజాతీయము :*** -ఇది ద్వ్యర్థి కావ్యము.కర్త కృష్ణాధ్వరి. తంజావూరును పరిపాలించిన రఘునాథనాయకుని (క్రీ.శ. - 1600-31) అస్థాన కవీశ్వరుడు. ఈ కావ్యమున నాలుగు ఆశ్వాసములు పూరిగను, అయిదవది అసంపూర్ణముగను, తంజావురు సరస్వతీ మహలు గ్రంథాలయమున భద్రముగనున్నది. రఘునాథనాయకునికి అంకితము.

***6. రాఘవ కృష్ణ పాండవీయము:*** - ఇది త్ర్యర్థి కావ్యము. కర్తరాజచూడామణి దీక్షీతులు. ఈతనిని చిన్నతనములోనే రఘునాథనాయకుడు ఆస్థాన పదవినిచ్చి సత్కరించినట్లు విషయము తెలియుచున్నది.

***7. రాఘవ యాదవ పాండవీయము :*** - ఇది త్ర్యర్థి కావ్యము. కర్త ఎలకుంచి బాల సరస్వతి ఈయన 17వ శతాబ్దివాడు. నాలుగు ఆశ్వాసముల ఈ కావ్యము శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితము. మద్రాసు ప్రాచ్య లిఖిత గ్రంథాలయమున ఈ కావ్యము లభ్యము. తన ప్రజ్ఞ + విశేషమును ప్రదర్శించి త్ర్యర్థి కావ్యము రచించెనని ఇట్లు పేర్కొనినాడు.

**"మెండైనట్టి విచిత్ర పైఖరులచే మీఁదౌమహాకావ్యముల్**
**దండియుం దొల్లియచేసిరాదిములు తత్కావ్యాధికశ్లాఘుమై**
**నుండస్ రాఘువ కృష్ణ పాండవ కథాయుక్త ప్రబంధంబు వా**
**క్పాండిత్యం బలవార శ్లేషరచనైక ప్రౌఢినే జేసెదన్"**

***8. నలయాదవ రాఘవ పాండవీయము:*** - ఇది చతురర్థి - కర్త గునుగుటూరి వేంకటకృష్ణ కవి. ఈతని మేనల్లుడు కోడూరు వేంకటాచలము, క్రీ.శ.1700సం.ప్రాంతము వాడు.కావున

ఈ కవి 1700 సం. ప్రాంతము వాడని చెప్పనగును. ఈ కవిని గూర్చి వేంకటాచలకృత 'శివరహస్యఖండ' మను గ్రంథము వలన తెలియుచున్నది.

***9. యాదవ రాఘవ పాండవీయము :*** - ఇది త్ర్యర్థి కావ్యము కర్త నెల్లూరి వీర రాఘవ కవి. నాలుగు ఆశ్వాసములు. ఈ కావ్యము గోపాల పరబ్రహ్మమునకు అంకితము. రచనా కాలము క్రీ. శ. 1717గ ఊహింపబడుచున్నది. గ్రంథము లభ్యము. విద్వాన్ సరిపెల్ల విశ్వనాథశాస్త్రి 'ఆనందజ్యోత్స్న' అను పేర టీక రచించిరి. సికింద్రాబాదు శివాజి ముద్రాక్షరశాలయందు 1964 సం. ముద్రింపబడినది.

***10. శివరామభ్యుదయము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త పోదూరి పెద్దరామామాత్యుడు పశ్చిమ గోదావరి ఆచంట గ్రామమందలి శ్రీరామేశ్వరస్వామికి, ఈ కావ్యము అంకితము. ఈతడు 1720-80 సం. మధ్య కాలము వాడని విమర్శకుల వక్కణ.

***11. యాదవ భారతీయము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము కర్త చెన్నకృష్ణ కవి. వనపర్తి సంస్థానాధీశులైన జనుంపల్లి వల్లభరాయనికి ఈ కృతి అంకితము.

***12. అచలాత్మజా పరిణియము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము తిరుమల బుక్కపట్టణము - కిరీటి - వేంకటాచార్యులు దీని కర్త. క్రీ.శ. 1766 అనంతరము సురపుర సంస్థానమున ఉన్నవాడని తెలియుచున్నది. మూడు ఆశ్వాసములు కలది. కృతి నామమున శ్లేషను ఆశ్లేషించిన ప్రథమ కావ్యము. అచలా - భూమి, అచల - పర్వతము ఈ విభాగము వలన సీతా పరిణయము, పార్వతీ పరిణయము అను  కథలు అనుసంధింపబడునట్లు తెలియుచున్నది. దీనిని తెలుగు విజ్ఞాన పీఠము వారు 1985సం. ప్రచురించిరి.

***13. లంకావిజయము -*** **(రావణ దమ్మీయము)**: - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త పిండిప్రోలు లక్ష్మణకవి. రెండు ఆశ్వాసములు కలది. ద్రాక్షారామ సమీపమున గల కుయ్యేరు గ్రామమందలి గోపాలదేవునికి ఈ కావ్యము అంకితము. కవి తన కావ్యమును క్రీ. శ. 1797 సం. శ్రావణమాసమున ప్రారంభించినట్లు తెల్పినాడు. ఈ కావ్యరచనమునకు ఒక ప్రత్యేక కారణమున్నది. ఆర్యవటమను ఊర నుండెడు దమ్మన్న అను నామాంతరము గల ధర్మారాయడు, కుయ్యేరు గ్రామము గుత్త చేసి కవికి చెందిన, అందు 'లంక' మాన్యమును బలిమిని హరించినాడు. కావున తత్ ప్రాప్తికై రాముని కథను తన కథను అనుసంధించి,

లంకా విజయమును రచించినాడు. ఈ గ్రంథమును వావిళ్ల వారు 1927 సం. ముద్రించినారు.

***14. కృష్ణార్జున చరిత్రము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త మంత్రి ప్రగెడ సూర్యప్రకాశకవి రెండు ఆశ్వాసముల కలది. క్రీ.శ. 1905 సం. శ్రీ విక్రమదేవవర్మ గారి టీకాతో వెలువడినది. ఈ కవి మాడుగుల సంస్థానాధీశుడైన శ్రీకృష్ణభూపతి - 1813- 75 - అస్థానకవి.

***15. రామకృష్ణార్జున (రూప) నారాయణీము :*** - ఇది త్ర్యర్థి కావ్యము. కర్త ఓరుగంటి సోమశేఖర కవి. నాలుగు ఆశ్వాసముకల, ఈ కావ్యము, తాళ్లవలసన వాస్తవ్యులు విజయనగర రాణాలకు అధిపతులు అయిన శ్రీ పూసపాటి నారాయణ రాజుకి, అంకితము అయినది. క్రీ.శ.1877లో ఈ అంకితము కావింపబడినది. ఈ కావ్యము 1895లో విశాఖపట్టణములో శ్రీ శారదామకుట ముద్రాక్షరశాలలో ముద్రింపబడినది. గ్రంథము లభ్యము.

***16. రామకృష్ణోపాఖ్యానము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త శ్రీపాద వేంకటాచల కవి. విజయరామ గజపతి - క్రీ.శ.1826-79-కాలమున విజయనగర సంస్థానములోని ముఖ్య కవులలో ఇతదొకడు. వేంకటాచల కవియే తన కావ్యమునకు వ్యాఖ్యానము వ్రాసినట్లును, వారి మేనమామ వారణాశి లక్ష్మీపతి సహాయపడినట్లును తెలియుచున్నది.

***17. రాఘవ వాసుదేవీయము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త చిత్రకవి సింగరార్యుడు. నెల్లూరు మండలము కందుకూరు తాలూకాలోని 'చుండి' పురాధీశ్వరుడైన బంగారంక భూపాలుని ఆశ్రితుడీకవి. తన అయిదాశ్వాసముల గ్రంథమును బంగారంక భూపాలునికే అంకితము కావించినాడు. ఈ కావ్యము క్రీ.శ.1800 సం. రచింపబది యండ వచ్చునని విమర్శకుల అభిభాషణ.

***18. వసుస్వారోచిషోపాఖ్యానము:*** - ఇది ద్వ్యర్థి కావ్యము. దీని కర్త కొత్తపల్లి సుందరరామకవి. ఈ కవి లక్కవరము సంస్థానాధీశుడైన మంత్రి ప్రెగడ భుజంగరాయుని- క్రీ.శ. 1876-1943,ఆస్థాన కవి.

***19. సారంగధరీయము :*** - ఇది త్ర్యర్థి కావ్యము. కర్త పోకూరి కాశీపతి. ఇతడు గద్వాల సంస్థాన రాణి అయిన ఆదిదేవమ్మ గారి ఆస్థాన కవులు. నాలుగు ఆశ్వాసముల తన

కావ్యమును, ఆదిదేవమ్మ గారి భర్త అయిన శ్రీ సీతారామభూపాలరావు గారికి, భూపాల రావు గారి మరణానంతరము, ఆదిదేవమ్మ గారి ఆదేశానుసారము అంకితమిచ్చినాడు. పార్వతీ పరిణయము, తారాశశాంకము, సారంగధరుడను ఒకవ్యక్తి కథను, అనుసంధించి, త్ర్యర్థిగ రచించినాడు.ఈ గ్రంథమును "తెలుగు విశ్వ విద్యాలయం" 1990సం. మే నెలలో ప్రచురించినది.

***20. ధరాత్మజా పరిణయము :*** - ఇది ద్వ్యర్థి కావ్యము. కర్త క్రొత్తలంక మృత్యుంజయ కవి. సీతాపార్వతుల కళ్యాణ ఇతివృత్తములను, అనుసంధించి ధరాత్మజా పరిణయ ప్రబంధముగ రచించినాడు. నాలుగు ఆశ్వాసములు కల కావ్యము శ్రీహరికి అంకితము. గ్రంథము లభ్యము. ఈకావ్య ప్రథమాశ్వాసమున అల్లూరి అప్పభూపతిచే ఈ కావ్యము రచింపబడినట్లు పద్యమొకటి కలదు. కాని ప్రతి ఆశ్వాసాంత గద్య యందు 'మృత్యుంజ', నామధేయము కానవచ్చుచున్నది. క్రీ.శ. 1897సం. కాకినాడ సుజన రంజని ముద్రాక్షరశాలలో టి.వి. యను నామమే గలవారి పీఠికతో ముద్రితమైనది.

***21. యాదవ రాఘవ పాండవీయము :*** - ఇది త్ర్యర్థి కావ్యము. కర్త అయ్యగారి వీరభద్రకవి.. ఇది మూడు ఆశ్వాసములు కలది. ఇంతకు మించిన విషయము మృగ్యము.

ఆంధ్రమున వెలసిన అనేకార్థక కావ్యములను పరిశీలించిన ద్వ్యర్థి కావ్యములు 13, త్ర్యర్థి కావ్యములు 6, చతురర్థ కావ్యములు 2, కానవచ్చును. వీనిలో ఒకటి రెండు కావ్యములను పరిహరించిన, మిగిలినవి అన్నియు భగవదంకితములే! ఈ కావ్యములు రసహీనములై ఉత్తమ కావ్య జాతికి చెందవని విమర్శకుల అభిప్రాయమేమైనను, కవుల భాషాధికారము పాండితీ ప్రకర్షకు నిదర్శమనుటలో సందేహము లేదు. ఈ ప్రక్రియ కావ్య జాలముతో ఆంధ్ర సాహిత్యము సుసంపన్నమైనదనుటలో లేదు.